## మీనాక్షి నటరాజన్‌ను కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నటరాజన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుక వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ పంపరి శ్రీనివాస్ ఉన్నారు.



## తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** జిల్లాలో వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో నీటిసరఫరాపై బుధవారం సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా నీటి లభ్యత, పైపులైన్ల మరమ్మతులు, ఇతర క్షేత్రస్థాయి సమస్యలపై ఆరా తీశారు. ఏ ఒక్క ఆవాస ప్రాంతంలోనూ నీటిఎద్దడి రాకూడదన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భీమ్ గల్ మండలం గోన్‌గొప్పుల ప్రభుత్వ పాఠశాల ఆవరణను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్, డీపీవో శ్రీనివాస్ రావు, డీఈవో అశోక్, ఇతర నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



**అక్షరటుడ, నిజామాబాద్ అర్బన్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ కృషి చేస్తుందని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు. బోధన్ పట్టణంలో టీఎన్జీవోస్ బోధన్ యూనిట్‌ను బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బోధన్ యూనిట్ అధ్యక్షుడిగా కార్తీక్ (ట్రెజరీ శాఖ), కార్యదర్శిగా సాయిలు (వ్యవసాయ శాఖ) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. వ్యవసాయ శాఖరిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వనమాల సుధాకర్ ఎన్నికల అధికారిగా, సహాయక ఎన్నికల అధికారిగా జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చుకూరి సతీష్, టీఎన్జీవో నిజామాబాద్ అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, ఆర్మూర్ యూనిట్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఇంటిబాట పట్టిన విద్యార్థులు..

**పదో తరగతి పరీక్షలు ఇటీవల ముగిశాయి. దీంతో పోచంపాడ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకున్న విద్యార్థులు తమ సామగ్రితో ఇళ్లకు పయనమయ్యారు. ఇన్నాళ్లు స్నేహితులతో కలిసి చదువుకున్న విద్యార్థులు.. వారికి వీడ్కోలు చెబుతూ తమ తల్లిదండ్రులతో ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు చేశారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.**

– అక్షరటుడే, మెండోరా



# అంగన్‌వాడీల్లో తొలిముద్ద

**అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇప్పటివరకు కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ఒకపూట భోజనం అందిస్తుండగా, తాజాగా చిన్నారులకు అల్పాహారం అందించనున్నారు. ఈ పథకానికి 'తొలిముద్ద' అని పేరు పెట్టారు. దీనిని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు 'రెడీ టు కుక్' విధానంలో ఉప్మా, కిచిడీ మిక్స్ వంటి పదార్థాలు అందిస్తున్నారు.** –అక్షరటుడే, భీమ్‌గల్

- చిన్నారులకు అల్పాహారం
- పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో వేలాది మందికి మేలు

చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన ఎదుగుదలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక పథకానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఉదయాన్నే బలవర్ధకమైన అల్పాహారాన్ని అందించే 'తొలి ముద్ద' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం అమలుతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వేలాది మంది చిన్నారులకు పౌష్టికాహార భరోసా లభించనుంది.

### ఉమ్మడి జిల్లాలో ఇలా..

పథకం అమలు కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1,501 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 90 వేల మంది చిన్నారులు ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో 1,193 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 79,280 మంది చిన్నారులు 'తొలి ముద్ద' లబ్ధిని పొందనున్నారు.

### సాంకేతికతతో పర్యవేక్షణ

ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను జోడించింది. అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసి, లబ్ధిదారుల వివరాలు, ఆహార పంపిణీ గణాంకాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో పర్యవేక్షణ సులభతరం కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుంది.

### కిచిడి, ఉప్మా

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు చిన్నారులకు బాలామృతం, నెలకు 16 కోడిగుడ్లు ఇస్తున్నారు. కేంద్రాలకు వచ్చే మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రతిరోజు ఉడికించిన గుడ్డు, ఒక పూట భోజనం పెడుతున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, సాంబరు వడ్డిస్తున్నారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలకు ఈ కార్యక్రమం అమలవుతుంది. అయితే ఇక నుంచి చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించనున్నారు. కిచిడి, ఉప్మా వడ్డించనున్నారు. చిన్నారులకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తొలిముద్ద కార్యక్రమాన్ని చేపడుతోంది.

### తల్లిదండ్రుల హర్షం

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఉమ్మడి జిల్లాలోని తల్లిదండ్రులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే పిల్లలకు పౌష్టికాహారం అందడంతో వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే మార్పు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం నగరంలో చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వదకద విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజల్లో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆస్పత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని 'రహ్ వీర్' కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, మేయర్ ఉమారాణి,



రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**అక్షరటుడే, కామారెడ్డి:** పాల్వంచ మండలంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపించుకోనేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, శంకర్ గౌడ్, వెంకట్ గౌడ్, రాజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రామస్వామి గౌడ్, అంజా గౌడ్, నవీన్ గౌడ్, చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి

**అక్షరటుడే, బోధన్:** విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సీపీ సాయిచైతన్య అన్నారు. బోధన్‌లో ఉషోదయ ఇంటర్ మహిళా కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ తదితర కోర్సుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం సన్మానించారు. విద్యార్థులు చిన్నప్పటినుంచి కష్టపడే గుణం ఉన్నప్పుడే త్వరితగతిన భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు స్థిరపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కాలేజీ ఛైర్మన్ ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 'ఈ కార్యదర్శి మాకొద్దు..'

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలం తిమ్మాపూర్ పంచాయతీ సెక్రెటరీ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఏదైనా సమస్య విషయమై ఆయనను సంప్రదిస్తే దుర్భాషలాడతున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీడీవో రాజేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో మురికి కాల్వలు, బోర్లు ఎన్ని ఉన్నాయో కూడా సెక్రెటరీకి తెలియదన్నారు. సమస్యలు పరిష్కరించాలని సంప్రదిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని.. కలెక్టర్‌కు చెప్పినా నాకేం భయం లేదని అంటున్నాడని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల పట్టివేత

**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండల పరిధిలో అక్రమంగా సాగుతున్న ఇసుక రవాణాపై సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. సీసీఎస్ ఏసీపీ మస్తాన్ వలీ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. వేల్పూర్ ఠాణా పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో రెండు భారీ ఇసుక లారీలను పట్టుకున్నారు. వాహనాలతో పాటు ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనాలను, నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వేల్పూర్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు సీసీఎస్ అధికారులు తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్‌ను ముట్టడించిన రైతులు



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను రైతులు ముట్టడించారు. ఈ మేరకు పసుపు కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ వారు అధికారులను ఘెరావ్ చేశారు. మార్కెట్‌కు ఈ మధ్య కాలంలో భారీగా పసుపు తరలివచ్చింది. సుమారు 50వేలకు పైగా పసుపు యార్డులో డంప్ అయ్యింది. అయితే ఆన్‌లైన్‌లో రూ.16వేలు క్వింటాల్ ధర ఉండగా.. మార్కెట్‌లో ఆఫ్‌లైన్‌లో మాత్రం రూ. 13వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాలుకు రూ.3వేల ధర తగ్గడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొనుగోళ్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మార్కెట్ కార్యాలయంలో ఫర్నీచర్‌ను రైతులు ధ్వంసం చేశారు. స్పందించిన అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారు. ఆన్‌లైన్‌లోనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ వచ్చాకే కొనుగోళ్లు ప్రారంభించాలని వారు కోరారు. దీంతో మార్కెట్ యార్డులో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే యార్డుకు చేరుకున్నారు. రైతులను సముదాయించారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మక ఘట్టం




**అక్షరటుడే, ఇందూరు:** నారీ శక్తి.. దేశానికే శక్తి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నాందేవ్‌వాడ శివాజీ చౌక్ నుంచి ఉమా మహేశ్వరాలయం వరకు నారీ శక్తి వందన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా స్వతంత్రం చేయడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెంచడం, మహిళల హక్కులు రక్షించడం.. నారీ శక్తి అభియాన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. మహిళల పాత్ర కుటుంబం నుంచి దేశాభివృద్ధి వరకు కీలకం కానుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇది కేవలం ఒక పథకం కాదని, మహిళలను సమాన హక్కులతో సమాజంలో ముందుకు తీసుకెళ్లే మహత్తర ఉద్యమం అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, విప్ న్యాలం సునీత, కార్పొరేటర్లు కల్పె అర్చన, వైష్ణవి, ఇప్పకాయల సుమిత్ర, కాంపల్లి మమత, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్‌లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాక్లూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ పుప్పాల చిన్న, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పాల చిన్న మాట్లాడుతూ రైతులు తమ పంటను తప్పనిసరిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎఫ్‌సీఐ కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం తూకం, రవాణా సౌకర్యాలు కల్పించాలని స్పెషల్ ఆఫీసర్ స్వప్న, సొసైటీ సెక్రటరీ రతన్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, సుమన్, గంగారెడ్డి, చింటూ, సంతు, సాయి కుమార్, రాజు, సునీల్, శ్రీనివాస్, శ్రీకాంత్, సాగర్ పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**అక్షరటుడే, భీమ్‌గల్:** రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డి సూచించారు. పచ్చలనడ్కుడ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే భిన్నంగా, రైతుల సౌకర్యార్థం ఈసారి అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం స్పెషల్ ఆఫీసర్ రమేష్, సెక్రెటరీ మహబూబ్, సర్పంచ్ నర్సయ్య, ఉపసర్పంచ్ రఘు, ఏఈవో స్నేహశ్రీ, జీపీవో కిషన్, గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్ పాల్గొన్నారు.

## వేంపల్లి పాఠశాల సందర్శన



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి పాఠశాలను నాగంపేట్ గ్రామ బృందం సందర్శించింది. నాగంపేట్ సర్పంచ్ దాసరి గంగాధర్, ఉప సర్పంచ్ మదన్ కుమార్, పాఠశాల హెడ్ మాస్టర్ లక్ష్మణ్, వార్డ్ సభ్యుడు సాయి గణేష్, విద్యా కమిటీ సభ్యులు ఓంకార్ కలిసి వేంపల్లి పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వేంపల్లి పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు తీసుకున్న చర్యలు, విద్యా ప్రమాణాలపై వివరాలు తెలుసుకున్నారు. హెడ్ మాస్టర్ శ్రీనివాస్, స్కూల్ ఛైర్మన్ రాకేష్, వైస్ ఛైర్మన్ సంజీవ్, వేంపల్లి సర్పంచ్ మహేష్ యాదవ్, గ్రామ సభ్యులు లక్ష్మణ్, హన్మాండ్లుతో చర్చలు జరిపారు. గ్రామాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు పరస్పర సహకారం అవసరమని ఈ సందర్భంగా తెలిపారు.

## పేద కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని గాజుల్‌పేట్‌లో నివాసముండే సంతోష్ కుటుంబానికి శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అంజేశారు. సంతోష్ స్థానిక గంజ్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. అయితే ఆర్నెళ్ల క్రితం అతడి ఎడమకాలికి గాయమై ఇప్పటికే రెండు ఆపరేషన్లు జరగగా.. మరో రెండు ఆపరేషన్లు జరగాల్సి ఉంది. ఆయనది పేద కుటుంబం కావడంతో ఫౌండేషన్ సభ్యులు ఆయన ఇంటికి వెళ్లి రూ.4వేల నగదు.. రూ.2వేల కిరాణా సామగ్రి అందజేశారు.



పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ గ్రామాలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక కవర్ల కారణంగా మానవాళికి ముప్పు వాటిల్లుతుందని తెలిసినప్పటికీ ప్రజలు వీటిని వినియోగించడం మానట్లేదు. దీంత ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యవరణానికి కూడా ప్లాస్టిక్ ముప్పగా సంక్రమించింది. దీంతో జిల్లాలోని కొన్ని పల్లెలు ఈ ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించాయి. స్వచ్ఛందంగా వీటి వినియోగాన్ని బ్యాన్ చేస్తున్నాయి. – అక్షరటుడే, ఆర్మూర్

# ప్లాస్టిక్‌పై పల్లెల యుద్ధం..

**గ్రామాల్లో పెరిగిన చైతన్యం**

**ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడవద్దని సూచన**

**మత్తుపదార్థాలు అమ్మినా.. కొన్నా జరిమానాలు..**

**మచ్చర్ల, కమ్మర్‌పల్లిలలో తీర్మానాలు**

గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్లాస్టిక్, కల్తీ వస్తువుల కారణంగా ఏర్పడే ఇబ్బందులపై అధికారులు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లను ప్రజల నుంచి దూరం చేయడానికి ఎన్ని రకాల నిబంధనలు తీసుకువచ్చినప్పటికీ వీటి వాడకం అధికమైంది. గ్రామస్థాయి నుంచి మార్పు రావాలన్న సంకల్పంతో జిల్లాలో పలు గ్రామాల అభివృద్ధి కమిటీలు, గ్రామపంచాయతీలు నడుం బిగించాయి. గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ, కల్తీ వస్తువులు గ్రామంలోకి రాకుండా కట్టడి చేస్తున్నాయి. హద్దు మీరితే ఐదువేల జరిమానాలు విధిస్తూ పల్లెలను స్వచ్ఛత వైపు నడిపిస్తున్నారు.



### ప్లాస్టిక్ టీ గ్లాసులు.. కవర్లు..

ప్లాస్టిక్ టీ గ్లాసులు, కవర్లు, టిఫిన్ భోజనం ప్లేట్ల వాళ్ళ వచ్చే అనారోగ్యాలపై అధికారుల అవగాహన కల్పిస్తూ వాటి స్థానంలో పింగాణి, మట్టి, స్టీల్ రాగి పాత్రలు వాడాలని గతంలో సూచించారు. ఆయా గ్రామాలు, పట్టణ ప్రధాన ప్రాంతాల్లో, కూడళ్లలో బ్యానర్లు కట్టిన ప్రజల్లో మార్పు రావడం లేదు. దీంతో పలు గ్రామాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ తీర్మానాలు చేశారు. ప్లాస్టిక్ భూతంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాయి.

### ఆలూరు మండలం మచ్చర్లలో..

ఆలూరు మండలం మచ్చర్ల గ్రామంలో పూర్తిగా ప్లాస్టిక్‌ను ఇటీవల నిషేధించారు. 25ఏళ్ల యువతకు సిగరెట్లు, పాన్ గుట్కా పదార్థాలు విక్రయించవద్దని తీర్మానించారు. ప్రతి హోటల్, కిరాణా, బేకరీ, దుకాణాల్లో ప్లాస్టిక్ నిషేధిస్తూ కరపత్రాలు అతికించారు. గ్రామ సర్పంచ్ కట్ట మల్లవ్వ నర్సయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు 500 ప్లేట్లు, 200 స్టీల్ గ్లాసులు, హోటళ్లకు 100 స్టీల్ గ్లాసులు, ప్రతి ఇంటికి రెండు బ్యాగులు అందజేశారు.

### కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఇటీవల సర్పంచ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, వార్డు మెంబర్లు, పంచాయతీ సెక్రెటరీ గంగా జమున ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఇప్పటి నుంచి ప్లాస్టిక్, మత్తు పదార్థాల విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు తీర్మానించారు. ప్లాస్టిక్ కవర్లలో పదార్థాలు అమ్మినా, కొన్నా.. రూ.వెయ్యి జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులకు సిగరెట్, పాన్, గుట్కా, గంజాయి అమ్మినా.. కొన్నా రూ.1000 జరిమానా ఉంటుందన్నారు.

### పిప్రిలోనూ..

ఆర్మూర్ మండలంలోని పిప్రిలోనూ నిర్వహించిన గ్రామసభలోను ప్లాస్టిక్‌ను నిషేధించాలని చర్చించారు. మరో వైపు ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో కెమికల్స్‌తో కూడిన నాణ్యతలేని ఐస్ క్రీమ్‌లను గ్రామంలోకి రాకుండా నిషేధించారు. ఇదే తరహాలో అన్ని గ్రామాలు ముందుకొస్తే ప్లాస్టిక్ భూతాన్ని గ్రామస్థాయి నుంచి తరిమికొట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకొని మరికొన్ని పల్లెలు సైతం మారే అవకాశం ఉంది.






## శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఉత్తర శబరిమల ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వాములు ఇరుముడులతో శబరిమల బయలుదేరారు. ఆగస్టు 1న అయ్యప్ప పుట్టినరోజును పురస్కరించుకొని మండల కేంద్రంలో స్వయంభు పదునెట్టబడిలో వెలసిన ఉత్తర శబరిమల ఆలయాన్ని అయ్యప్ప స్వాములు, గురుస్వాములు నంభుత్రి, రవి గౌడ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మాలధారణ చేసిన భక్తులు 41 రోజుల మండల దీక్షను పూర్తి చేసుకుని శబరిమల అయ్యప్పను దర్శించుకునేందుకు తరలివెళ్లారు.

## ఆర్మూర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిక ప్రకటన తెలిపారు. డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో బీఎస్సీలో (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, బీజెడ్సీ, ఎంబీ జెడ్‌సీ) బీకాంలో (సీఏ, బీఏ), బీఏలో (హెచ్‌ఈపీ) కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులను పదో తరగతి, ఇంటర్ మెమోలు, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డ్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకొని కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 98665 86887, 99596 31207, 80081 19072లను సంప్రదించాలని తెలిపారు.

## 30 ఎల్పీజీ సిలిండర్ల పట్టివేత



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలో హోటళ్లతో పాటు పలుచోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. 30 గృహావసరాల సిలిండర్లను వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ డీఎస్పీ శేఖర్ రెడ్డి, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు పవన్ కుమార్, శ్రీనివాస్, నిఖిల్ రాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై దాడి..

**భీమ్‌గల్, అక్షరటుడే:** పట్టణంలోని బాపూజీనగర్ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార ముఠా వ్యవహారాన్ని పోలీసులు గుట్టురట్టు చేశారు. భీమ్‌గల్ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు భీమ్‌గల్ పోలీసులు బుధ వారం ఓ నివాసంపై ఆకస్మిక దాడి నిర్వహించి, నలుగురు పురుషులు సహా ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని బాపూజీనగర్‌లో ఇద్దరు వ్యక్తులు ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, బయట వ్యక్తులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పోలీసుల దాడి సమయంలో ఓ వ్యక్తితో పాటు ఓ మైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.2,450 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థిని మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన ఎల్లారెడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ బాలికల వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న శ్రావణి అనే విద్యార్థి బుధవారం తెల్లవారుజామున వసతి గృహం వరండాలో పడి మృతి చెందింది. వాష్ రూమ్ కోసం వెళ్లి వస్తుండగా పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. వసతి గృహం సిబ్బంది హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రావణిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఉన్నతాధికారు ఫిర్యాదుతో ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ ప్రేమ్, సీఐ రాజిరెడ్డి, ఎస్సై మహేష్ ఆస్పత్రికి చేరుకున్నారు. వసతిగృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.

### సమగ్ర విచారణ చేపట్టాలి

బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థిని శ్రావణి మృతిపై అనుమానాలున్నాయని.. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడ ఎల్లారెడ్డి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విరమించాలని ఎస్సై మహేష్, సీఐ రాజిరెడ్డి సర్ది చెప్పినా ఆందోళన విరమించలేదు. బాన్సువాడ డీఎస్పీ విఠల్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన కారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




## అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలకు ఫైర్ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల ఈనెల 14న ప్రారంభమైనట్లు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతాయని వారన్నారు. వారం రోజులపాటు అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఫైర్ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన కరపత్రాలను పరిష్కరించారు.

## జీజీహెచ్‌లో చలివేంద్రం ఏర్పాటు



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో ఎండల తీవ్రతకు ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోగులకు, వారి బంధువులకు చల్లని నీరు అందించేందుకు బుధవారం ఆస్పత్రిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. రోగుల బంధువులు సేద తీరుతూ భోజనం చేసే ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రోగులకు ఈ వేసవికాలంలో తాగునీటి ఇబ్బంది ఉండకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు యాదగిరి, సంతోష్, అభిజిత్, జమీర్, శానిటేషన్ సూపర్ వైజర్ ఇర్ఫాన్, రాజేష్, భారత్, మారుతి పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం మచ్చర్లకు చెందిన కోలాపూర్ ధనలక్ష్మి అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బాధితురాలికి రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. దీంతో బుధవారం మచ్చర్లలో సర్పంచ్ కట్ట నర్సయ్య బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం తమను సంప్రదిస్తే సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తామన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు




**అక్షరటుడే, బాల్కొండ:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముప్కాల్ చౌరస్తాలో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు, దుకాణదారులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, వాటర్ డెమో నిర్వహించారు. కార్యక్రమంలో బాల్కొండ ఫైర్ స్టేషన్ ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ శేఖర్, లీడింగ్ ఫైర్ ఫైటర్ హరికృష్ణ, డ్రైవర్ ఆపరేటర్ శ్రీనివాస్, ఫైర్ ఫైటర్స్ రంజిత్, ఎన్. సంకీర్త్ పాల్గొన్నారు.